# క్రీడాకలాపాలు

గోరా శాస్త్రి

అక్షరాలా ఆంధ్రుణ్ణి, అంకెల్లో చెప్పవలసి వస్తే మధ్యతరగతి మధ్య మెట్టుకి చెందిన వాణ్ణి, అందులోనూ గోదావరి ఒడ్డు గ్రామంలో బాల్యం గడిపినవాణ్ణి - యిన్ని అర్హతలూ, సదుపాయాలూ, ఉన్నవాణ్ణి అవడం చేత బాల్యం అంతా యించుమించు తెలుగు సంస్కృతి సేకరించుకోవడంలోనే గడిపానని చెప్పవచ్చు. అందువల్లే ఒక్క భోజనాల వేళా, రాత్రి నిద్రపోయే సమయమూ, మినహాయిస్తే, తక్కిన వేళల్లో యింట్లో నన్ను చూడడము అసంభవంగా ఉండేది. గోదావరి గట్టున రేగిపళ్ళ సేకరణ, దేవాలయం తోటలో 'సీతాఫలపళ్ళ' అన్వేషణ, హైస్కూలు ఆవరణ వెనక ఉండే చిట్టడివిలో పరిగిపళ్ళ వేట-యీ ముఖ్యమైన పనులన్నీ ముగిశాక, యింకా వ్యవధి ఉంటే పోయి క్లాసులో కూర్చునేవాళ్ళం. అప్పట్లో మా మేష్టరుగారు - మాట వరసకి ఆయన్ని ఆదినారాయణగారందాం- ఏ కారణం వల్లనో కాని, మేం ఊరుమీద పడి తెగ తిరుగుతూంటే తెగ సంతోషించి క్లాసులో కూర్చుంటే తిట్టి పోసేవాడు. ఇప్పుడాలోచిస్తే అనిపిస్తోంది-పాపం-ఆయన వయసువల్ల పెద్దవాడే గాని-తనకి ఏ పన్నెండేళ్ళ వయస్సు తరవాతనో అన్నివిధాలా ఎదగడం మానేశాడు. అంచేత మేం క్లాసులోకి వెళుతూ పుస్తకాలు తీసికెళితే, వాటివంక జాలిగా చూసేవాడు. వాటి బదులు అప్పుడే అడివంతా తిరిగొచ్చిన కాలి బురదా, రేకిపళ్ళూ, పరిగిపళ్ళూ, పువ్వులతో సహా ఊడబీకిన నాలుగైదు బంతి మొక్కలూ, యివి పట్టుకు క్లాసులోకి వెళితే ఆయన మొహం భగవద్దర్శనం చేసిన భక్తుడి వదనంవలె వికసించేది. ఫలం, పుష్పం, పత్రం అన్నట్టు, తెచ్చిన వాటిలో ఆయనకి మాతోపాటు సమానంగా వాటా పంచేవాళ్ళం. రేకిపళ్ళు అతి ఆప్యాయంతో తింటూ, బంతిపువ్వులు వాసనచూస్తూ—

'ఈ బంతిపువ్వు లెక్కడివిరా?' అనేవాడు.

'హెడ్మాస్టరుగారి పెరట్లోవండి. ఎవరూ చూడకుండా పీక్కొచ్చేశాం' అనేవాళ్ళం.

'భలే. నేనూ మీతో లేకపోతిని గదరా!' అనేవాడు. ఆ క్షణంలో ఆయన్ని చూస్తే కళ్లంబడి నీళ్ళొచ్చేవి.

'ఇమాటు మీరుకూడా రండి మేస్టారూ' అనేవాళ్ళం.

'ఏమొయ్యా రాత. అంత అదృష్టమా' అని నిట్టూర్చేవాడు.

'లేదు మేస్టారూ. రండి, ఇప్పుడు పోదామా?' గోదావరొడ్డున రేగిచెట్లు ఎంతో విరగ కాచాయి మేస్టారూ. రండి, మళ్ళీ సాయంత్రమయితే నక్కలు తినేస్తాయి' అని ప్రాధేయపడేవాళ్ళం.

'హెడ్మాస్టారు పోనివ్వడురా' అనేవాడు జాలిగా.

ఆ క్షణంలోనే హెడ్మాస్టరు వరండా పక్కగా వెళుతూ కిటికీలోంచి మా గదిలోకి తొంగి చూచేవాడు. ఆదినారాయణ మేస్టారు పంచ, పాగా సవరించుకుని బెత్తం చేత్తో పట్టుకుని 'సైలెన్స్! యూ థర్డ్ బోయ్ ఆన్ ది థర్డ్ బెంచ్, కాశ్మీరదేశపు అడవుల్లో ఏమిపండును?' అని అడిగేవాడు.

'పరిగిపళ్ళు' అనేవాడు, మాలో ఎవడో. అంతా గొల్లుమనేవాళ్ళు హెడ్మాస్టరుగారింకా కిటికీ పక్కనే ఉండేవాడు. అప్పట్లో మమ్మల్నెవరయినా హెడ్మాస్టరుకి పర్యాయపదాలు అడిగితే రావణాసురుడూ, మారీచుడూ, ఖరుడూ, దూషణుడూ-యిలా చెప్పి ఉండేవాళ్ళం.

రాత్రి వేళల్లో మమ్మల్నందర్నీ పోగుచేసి ఆయన ఉప్పుపట్టీ, వెన్నెల కుప్పలూ, ఆడించేవాడు. సెలవురోజుల్లో గోదావరి ఒడ్డు యిసకల్లో చెడుగుడు ఆడించే వాడు. మేస్టారు దగ్గిర చిన్న పెట్టెడు గోళీ లుండేవి- మట్టివి. గాజువి

అవన్నీ మాకిచ్చి ఆడించేవాడు. వర్షాకాలంలో మాతో పాటు కాగితం పడవలు చేసి ఊరంతా తిరిగి వాటిని నీళ్ళ కాలవల్లో, మడుగుల్లో వదిలేవాడు.

ఒకనాడు సాయంత్రం గోదావరొడ్డున, చెడుగుడు ఆడి తిరిగి యింటికొచ్చేస్తున్నాం. దారిలోనే ఊరి ఘరానా ఉద్యోగుల క్లబ్బు ఉంది. రోజూ అలాగే వెళ్ళేవాళ్ళం. కాని ఆనాడెందుకో అది ప్రత్యేకంగా మా దృష్టి నాకర్షించింది. ఆవరణలో మొగవాళ్ళూ ఆడవాళ్ళూ కలిసి టెన్నిస్ ఆడుకుంటున్నారు. మా కంటికి వాళ్లు దేవతామూర్తులవలె కనిపించారు.

'మేస్టారూ! మనంకూడా టెన్నిస్ ఆడకూడదూ!' అన్నాను నేను.

'నువ్వు పెద్దయాక నేర్చుకుందువుగాని లే! ఇప్పుడు నిన్ను ఆడనివ్వరు' అన్నాడాయన. దానిమీద ఎంతో చర్చ జరిగింది. ఎందుకాడ నివ్వరు? పోనీ వాళ్ళు ఆడనివ్వకపోతే మేమే వేరేచోటు చూసుకుని ఎందు కాడుకోకూడదు? ఇలా వెళ్లింది మా ధోరణి. ఆయన చాలా ఓపికతో, మాకు అర్థం అయేటట్టు చెప్పడానికి ప్రయత్నించాడు. అది ఖరీదయిన ఆట, దానికి బోలెడంత సామగ్రి ఉండాలి. కావలిస్తే వచ్చే సంవత్సరం పైక్లాసు కొచ్చాక, స్కూల్లో హాకీ గాని, ఫుట్‌బాల్ గాని ఆడుకోవచ్చు.

అలాగే పై సంవత్సరం స్కూలు జూనియర్ హాకీ టీములో చేరాను. స్పోర్ట్సు మేస్టరు పుస్తకంలో సంతకం పెట్టించుకుని ఓ హాకీ కర్ర యిచ్చాడు. అంతటితో నేనేదో గొప్పవాణ్ణయి నట్టు అనిపించింది. చేతిలో అదోరకం వంకరకర్ర. అది పుచ్చుకోడానికి సంతకం పెట్టడం-ఇంక పెద్ద క్లాసు కుర్రాళ్ళవేపు ధీమాగా చూడొచ్చను కున్నాను. ఆ సాయంత్రం ఆ కర్రపట్టుకు ఆటకి బయలుదేరడం, జూనియర్ హాకీ కెప్టెన్ నావేపు అదోలా చూసి తరువాత ఆటలో పొరపాటున అన్నట్టు కర్రతో మోకాలు మీద కొట్టడం-అదంతా వేరే కథ. అలా క్రమంగా పైక్లాసు లకి వెళుతున్నకొద్దీ రకరకాల ఆటలు-కర్రలూ, బంతులూ, తెరలూ, సెట్టులూ-యివన్నీ కావలసి వచ్చేవి - ఆడడానికి ప్రయత్నించేవాడిని. హాకీ ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, రింగ్ టెన్నిస్, బ్యాడ్‌మింటన్ - అన్నీ నా కొక్కలాగే వచ్చేవి. అంటే వేటిలోనూ, ఏ విధంగానూ రాణించలేక పోయేవాణ్ణి. కాని సాయంత్రం ఆటయిపోయాక ఏ హాకీ కర్రో చేత్తో పట్టుకుని గర్వంగా యింటికొచ్చేస్తూంటే రోడ్డు పక్క దుకాణాల వేపూ, వీధి అరుగు మీద కూర్చుని పాఠాలు చెప్పించుకుంటూ రోడ్డు మీదుగా పోయే ఆవుల వేపూ, మా వేపూ జాలిగా చూసే చిన్నపిల్లలూ, యిళ్ళల్లో దీపాలు వెలిగించే గృహిణులూ, నా కెందుకో దురదృష్ట వంతులలాగా గోచరించేవాళ్లు. ఆడినంత సేపూ కలిగే ఆనందం కంటే, తరవాత యిలా అన్నీ పరిశీలిస్తూ యింటికొచ్చేస్తూంటే కలిగే ఆనందమే ఎక్కువగా ఉండేది. అయ్యో నా కంటె తక్కినవాళ్ళు బాగా ఆడేస్తున్నారని కాని, బంతి మన అధీనంలోంచి జారిపోయిందని కాని, నా కెప్పుడూ అనిపించేదికాదు. ఆఖరికి నన్ను గోలు కీపరుగా పెట్టినప్పుడు ఎవరో వచ్చి గోలు కొట్టేసినా నాకు పౌరుషం వచ్చేదికాదు. ఆటంతా అయిపోయాక, అలా ఆడాడు, వీడు యిలా తప్పు చేశాడు అని అంతా చెప్పుకుంటూంటే నాకు ఆశ్చర్యం వేసేది, వీళ్ళ కివన్నీ ఎలా జ్ఞాపకం వున్నాయా అని.

ఆ సంవత్సరమే స్కూలు జట్టులోంచి కొందర్ని ఏరి, ఓ మేస్టర్ని జతచేసి, యింకే వూరో ఆటల పోటీకి పంపించారు. అందులో నేను లేనని విషయం ప్రత్యేకంగా చెప్పక్కర లేదు. వారం పదిరోజులు పోయిన తరువాత జట్టు మళ్ళీ తిరిగొచ్చింది - వెండి కప్పుతో సహా. ఆ తరువాత కొన్నాళ్ళపాటు ఆ జట్టువాళ్ళంతా స్కూల్లో వీరులయిపోయారు. ఆవీరుల్లో ఒకడు నా క్లాసు కుర్రాడు. పట్నం వెళ్ళి వాడుచూసి వచ్చిన విశేషాలు, వింతలూ, అక్కడ వారికి జరిగిన అఖండ సన్మానాలూ అవన్నీ వాడు నాకు మూడు పగళ్ళూ, మూడు సాయంత్రాలూ వర్ణించాడు. కలక్టరుగారి సతీమణి స్వయంగా వీడితో కరచాలనం చేసి వెండి కప్పు బహుమతీ ఇవ్వడం, హాలులో అంతా చప్పట్లు కొట్టడం, అదంతా వాడు వేడివేడిగా వర్ణించుకుపోతుంటే నా కేదో వాడు అర్జునుడు అయినట్టూ, కాలకేయాది రాక్షసుల సంహారం తరవాత ఇంద్ర సభలో

సన్మానం జరిగినట్లూ అనిపించింది. ఆ తరవాత వాడు పూర్తిగా మారిపోయాడు. జీవితంలో ఒక ఆదర్శం దొరికినట్లనిపించింది కాబోలు, ఇక సర్వ శక్తులూ ఆటలకే వినియోగించేవాడు. బయటి ప్రపంచంలోకి ఒకసారి తొంగిచూశాడు కనక, ఎక్కడో దూర తీరాల్లో తనకంటె ఘనులైన ఆటగాళ్లు ఉన్నారనీ, వాళ్లకి మరీ భారీ యెత్తున సన్మానాలు జరుగుతుంటాయనీ, లీలగా గ్రహించి సాధన ప్రారంభించాడు. రోడ్డుమీద నడుస్తుంటే కనబడ్డ రాళ్ళను కాళ్లతో ఫుట్ బాల్ వలె తన్నేసేవాడు. తెల్లారకట్ట లేచి, కొందరు జట్టుని పోగుచేసుకొని, హాకీ, ఫుట్ బాల్ యివి ఆడేవాడు. వార్తా పత్రికల్లో వీటి సంగతులు పడతాయని విని, స్పోర్ట్సు పేజీ చదవడం నేర్చుకున్నాడు. క్రమంగా యిదొక నిషావలె వాడి లేత మనస్సుకి ఎక్కిపోయి, అహో రాత్రాలు అదే ధ్యాస తప్ప యింకోటి లేదు. ఆ విధంగా ఎలాగో హైస్కూలు జీవితం గడిపి తరవాత కాలేజీకి వచ్చాడు.

తలుచుకుంటే యిప్పుడనిపిస్తుంది. జీవితంలో కొన్ని సూక్తులు ఒక్కొక్కప్పుడు ఎడా పెడా కూడా రుజువు చేసుకుంటూ ఉంటాయి. సాధనమున పనులు సమకూరు ధరలోన అని సూక్తి. ఏకాగ్రతతో ప్రయత్నించి సాధన చేస్తే అందుకో లేనిది ఏదీ లేదని పెద్దలంటూంటారు. ఈ సత్యాన్ని రుజువుచేసే మహనీయుల కథలు చరిత్రలో కొల్లలుగా ఉన్నాయి. నత్తివాళ్లు మహా వక్తలయారు. పిరికివాళ్లు వీరాధి వీరులయారు. గర్భదరిద్రులు కోటీశ్వరులయారు. నిజమే అయుండొచ్చు. కాని ఎంత సాధన చేసినా ఏమీ కాలేని వాళ్ళసంగతి ఎవరూ పరిశోధన చేసి ప్రతీసీ కేవలం పురుష ప్రయత్నం మీదనే నెగ్గలేమని రుజువు చేసిన కథలంత ప్రచారంలో లేవు. అందుకు మా హైస్కూలు వీరుడొక ఉదాహరణ. వాడి సాధనలో ఏదైనా లోపం ఉందని అనడం సాహసం. అలా అంటే కళ్లు పోతాయి. కాని ఫలితం మాత్రం శూన్యం అయింది. ఎంత ప్రయత్నించినా వాడికి ఒక్క ఆటా పరిపూర్ణంగా పట్టుపడలేదు. కొంత ప్రావీణ్యము వచ్చాక గొఱ్ఱె తోకలాగ అలాగే ఉండి పోయాడు.

కాలేజీ జీవితంలోనూ, అనంతరం ఈ విశాల భూఖండంలోనూ, యిలాంటి వ్యక్తుల్ని చాలా మందిని చూశాను. వీళ్లంతా ఒకానొక ఆంగ్ల కవి చెప్పినట్లు మూగవోయిన గాయకులు, చదువు రాని కాళిదాసులు, అవకాశంలేని నెపోలియన్లు రూజువెల్టులూ. ఇక అనంతర జీవితంలో వీళ్లు ప్రపంచం గుర్తించని మహనీయుల వలె మొహం పెట్టుకు తిరుగుతూంటారు. వీళ్లు చిన్నప్పుడు హైస్కూలు జీవితంలో పి రింగ్ టెన్నిస్లో ఆరునెల్లపాటు అసిస్టెంటు కెప్టెనుగా పని చేస్తారు. తరవాత గ్రిగ్ మెమోరియల్ స్పోర్ట్సులో పాల్గొంటారు. ఇక సరి. జీవితమంతా ఆ కథలే చర్విత చర్వణంగా చెప్పుకుంటూ కాలం గడుపుతారు. ఇక వీరి మస్తిష్కంలో మోసుకు తిరిగే భోగట్టా అపరిమితం. ప్రపంచంలో యివాళ అత్యంత మహనీయుడైన క్రికెట్ ఆటగాడెవడు? హాకీ ఆటగాడెవడు? వాళ్ళ పూర్తి జీవిత చరిత్ర ఎటువంటిది? ఏ మాచ్లో ఏ విధంగా ఆడారు! ఎన్ని గోల్లు కొట్టారు! లేదా ఎన్ని వికెట్లు! ఎన్ని రన్నులు! నిద్రలో నిలదీసి అడగండి. అనర్గళంగా చెప్పేస్తారు. వార్తా పత్రిక రాగానే మొట్టమొదట వీళ్లు చదివేది క్రీడారంగ విశేషాలు. డాన్ బ్రాడ్మన్ ఏమన్నాడు? జాన్ ఫింగిల్టన్ ఏం రాశాడు? డిల్లన్, యిప్పుడెక్కడ విశ్రాంతి తీసుకుంటున్నాడు? ఈ విశేషాలన్నీ అత్యంత భక్తితో సేకరించి అడిగిన వాళ్ళకి, అడగని వాళ్లకి అందజేస్తుంటారు. ఒకొక్కప్పుడు వీళ్ళలో వీళ్ళకి అభిప్రాయ భేదం వస్తుంది. ౧౯-౩౮ ఆస్ట్రేలియాకీ, ఇంగ్లండుకీ నాటింగ్ హామ్ షైరులో జరిగిన క్రికెట్ మాచ్లో ఇంగ్లండు ౧౯౮ కి ఔట్ అయిందనీ ఒకడంటాడు ప్రస్తావనలో.

'మీరు పొరబడుతున్నారు. ౨౧౮కి ఔటయిం దంటాడు, పక్కవాడు. 'బలేవాళ్లు లెండి. ఆ టీములో ఎవరెవరు వెళ్లారో తెలుసా, మీ కసలు? ఆ క్రితం సంవత్సరమే నేను వాళ్ల ఆట బొంబాయిలో చూశాను. వాళ్ళ కెప్టెను ఆటో గ్రాఫ్ కూడా తీసుకున్నాను' అంటాడు మొదటి వాడు. ఇంక పదాలతో మల్లయుద్ధం ప్రారంభం. ఇద్దరూ కూలంకషంగా చర్చించుకున్న

వాళ్లేనాయె. ఇక వింటున్న మనబోటివాళ్లెవరూ తగాదా తీర్చలేరు. అసలా సంవత్సరంలో వాళ్ళంటున్న మాచ్ జరిగిందో లేదో జరిగితే ఎవరు గెలిచారో, మనకి తెలియదు. చివరికి వాళ్ళలో ఒకడు:

'చెప్పొచ్చారు! క్రికెట్ గురించి మీరు నాకు చెప్పొచ్చారు. అందులో పండిపోయిన వాణ్ని!' అంటాడు.

రెండో వాడికి ఒళ్లు మండుతుంది. 'పండి పోయి. ఎండిపోయారు కూడాను. ఆ మాట కొస్తే హాబ్సునుంచి మన్కాడ్ దాకా చూస్తున్న వాణ్ణి—నా ఖర్మ! నేను మీతో క్రికెట్ గురించి వాదించడమేమిటి?' అంటాడు.

మనకి ఇద్దరూ రైటే ననిపిస్తుంది.

మనం నివసిస్తున్న యుగం భారీ యుగం. గుండుసూది తయారీకి మహా కర్మాగారాలు నిర్మించినట్టే క్రీడా కలపాలుకూడా, భారీ యెత్తున నడిపిస్తుంటాం. బంతి కుడినుండి ఎడమకు విసరడంలో ఒకడు స్పెషలిస్టు. ఎడమనుండి కుడికి విసరడంలో ఇంకోడు ఘనాపాటి. ఆటువంటి ఖరీదైన యుగంలో మన ఆశయాలూ, స్వప్నాలూ, చాలా ఖరీదుగానే ఉంటాయి. అవి సఫలమయే మార్గం, అనేకులకు ఉండదు. అది జీవితసౌఖ్యానికి అనవసరమని వాళ్ళకి అనిపించదు. ఈ రెంటికీ మధ్య సంఘర్షణ ఏర్పడి, సూటిగా రంగస్థలంలో దూరడానికి చోటు దొరక్క ప్రేక్షకుడిగానో, శ్రోతగానో నిలబడి, ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుందికి ప్రయత్నిస్తాం. ఆటువంటి దానికి స్వోత్కర్ష లేనిదే నిలబడదు గనక స్వోత్కర్ష సాధన చేస్తాం. అందువల్ల అది ఒక వినోదంగానూ ఆనందించలేక, విజ్ఞానంగానూ మార్చుకోలేక ఇతరులమీద రుద్దేస్తుంటాం. చిన్నప్పుడు మనం గ్రామ కాలవలో ఆరఫర్లాంగు యీదడం కష్టపడి నేర్చుకున్నాం. బాగానే ఉంది. అపైన యీదడానికి మనకి దమ్ములు లేవు. సరే; ఫరవాలేదు, దానికేం! అంతా గజీతగాళ్లు కాలేరు. ఆలా అని అంతటితో వదిలేస్తామా? ఇక జీవితాంతంవరకు ఎక్కడ యీతగురించి ప్రస్తావన వచ్చినా, దాన్ని అలాపోనియ్యడం మనకి ఇష్టం ఉండదు. మనం యీతగాళ్లమే గాక, యీత శాస్త్రంలో మహా పండితులమని వీలయినంత వరకూ స్నేహితులచేతా, బంధువులచేతా, ఒప్పించాలి. ఎక్కడ శాస్త్ర యీత పోటీలు జరుగుతున్నాయన్నా మనం తయారు. అలాగే క్రికెట్, ఆలాగే హాకీ, టెన్నిస్, ఇంకే క్రీడాకలాప మయినాసరే. కలకత్తాలో మోహన్ బగన్ మాచెస్ చూశారా? పోనీ బొంబాయిలో బేబోర్న్ స్టేడియమ్ చూశారా? ఇదీ వరస. చూడలేదంటే నాగరికతకి లోపమని బెంగ.

నగరంలో ఏవో మాచెస్ జరుగుతాయి. విఖ్యాతులైన ఆటగాళ్ళు వస్తారు. పరిణతి పొందిన ఏ కళాప్రదర్శనమయినా నేత్రోత్సవంగానే ఉంటుంది గనక వేలాదిప్రజలు చూడడానికి వెళతారు. బాగానే ఉంది. కాని కొందరు మహానీయులుంటారు. వాళ్ళది ఆలా తీసుకోలేరు. ఆదేదో ఒక కఠోర తపస్సు అనుకొని నానా హంగామా చేసుకొని, డబ్బు లేకపోయినా అప్పుచేసి మాచెస్ జరుగుతున్నన్ని రోజులూ ఎండనక వాననక అక్కడే గడిపి—కాస్త కలవాళ్ళయితే సతీసమేతంగా—అక్కడి అంకెలన్నీ కంఠస్తం చేసి, ఎవడైనా కదుపుతాడా, అంకెలన్నీ వర్షం కురిపించేద్దామా అని చూస్తారు. నాబోటి మందగొడి వాడెవడయినా, బస్సులో ట్రాంలో ప్రయాణంచేస్తుంటే ఆకస్మాత్తుగా భుజంతట్టి 'ఏమండీ స్కోరెంతండీ' అంటారు. ఓసారి యిలాగే ఎవరో అడిగితే పరాగ్గా 672 అన్నాను- స్కోరంటే ఏమిటో తెలీక. ఎంతకి? అన్నాడు. 'పద్నాలుగుకి' అన్నాను ఎంతయితేనేం అనుకుని. నన్నేదో జంతువుని చూసినట్టు చూసి, పక్క స్టాపింగులో దిగిపోయాడు.

ఇంకొక మనస్తత్వం గల మహానీయు లున్నారు. వాళ్ళకి నుదిటిమీద ఓ చిన్న గాయపు మచ్చ, ఆలాంటిదే యింకోటి మోకాలిమీద ఉంటాయి. అవేమంత ప్రత్యేకమైనవి కావు. ఇంచుమించు ప్రతి మానవుడికీ ఉండేవే. కాని, వీళ్ళదగ్గిర మాత్రం వీటి కొక ప్రత్యేకత్వం వస్తుంది. పొరపాటున వాటిమీద మన దృష్టి పడిందా యింకో నలభై నిముషాలపాటు మనం చిన్న ఉపన్యాసం వినబోతాము అన్నమాట. 'ఇదాండి, ఇది ఓ సందర్భంలో తగిలింది లెండి.

అసలు తల ఎగిరి పోవలసింది. కాని కొంచెంలో తప్పిపోయింది. 100 యార్డ్స్ డాష్ కాలేజీలో ప్రాక్టీసు చేస్తుంటే, ఓసారి గోతిలో పడి పోయాను. ఆరోజులే వేరులెండి. ఇలా ప్రారంభించి తను ఎలా కాలేజీలోకల్లా వీరుడయిందీ ఎలా ప్రైజులన్నీ కొట్టేసిందీ, ధైర్యం సాహసం శరీరబలం యివన్నీ పెంపొందించుకుంటూ ఎలా ఊరునీ కాలేజీనీ గడగడ లాడించిందీ– ఉదాహరణలతో సహా వివరిస్తాడు. అతనలా మాటాడుతున్నంతసేపూ, మనం అతని స్థూలకాయం వేపూ లోతుగాపోయి చుట్టూ నల్లగుంటలుబడ్డ కళ్లవేపు చూస్తూ కూర్చోవాలి.

మహానగరంలో వడీ వేగం యీ రెండిటితో జీవిస్తూంటే, అప్పుడప్పుడూ వార్తా పత్రికా కార్యాలయాల ముందు గుంపులుగా నిలబడి జనం ఏక్కడో జరుగుతున్న న్యూస్ తాలూకు స్కోర్ ప్రకటించే బోర్డువేపు చూస్తూంటారు. క్షణ క్షణం ఎవరెన్ని పరుగులు తీశారో తాజాగా ఆ బోర్డు మనకి అందిస్తుంది. ఆ జనానీకంలో ఎంతమంది విఫలులయిన జగజ్జెట్టీలున్నారో అనిపిస్తుంది. ఆ ఘడియల్లోనే నాకు మా ఆదినారాయణ మేష్టారు జ్ఞాపకం వస్తారు. పరిగి పళ్ళకి అడివికి వెడితే, అక్కడ పిగిలిపిట్టల్నీ, అడివి రామచిలకల్నీ చూసి మరీ రమ్మనేవాడు. గోదావరి గట్టున చెడుగుడు ఆట మధ్యలో ఆపి ఆకాశంలో ఎగిరే కొంగల బారుల్ని చూడమనేవాడు. ఇప్పుడాయన నాతో పాటు పట్నంలో ఉంటే యీ భారీ పరిశ్రమల ఆటల గురించి ఆయన్ని అడగాలని ఉంది. కాని ఆయన ఎక్కడున్నాడో! ఏ కొంగల బారుని చూస్తూ ఎక్కడున్నాడో!

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)

# కల్పనల అల్లిక

దండమూడి మహీధరకుమార్

ప్రియమైన అక్కకు,

నీ ప్రియమైన చెల్లి అభివాదాలు. నేనీ లేఖను చాలా కాలం గడిచినతర్వాత రాసేందుకు కూచున్నాను. నీనుంచి లేఖ వస్తుందని ఎన్నో రోజులు నిరీక్షించాను. కాని నేను రాసిన లేఖలు అందలేదేమోనని నాకు నేను ఊరడించుకొని ఊరుకున్నాను.

నీవు నాకు అక్కవై వుండికూడా చాలా దూరంగా వుండిపోయావు. నా అంతర్యానికి దూరమైన చందంగా - నిన్ను కలుసునునేందుకైనా వీల్లేకుండా బాహ్యంగాకూడా వందల మైళ్ళదూరంలో వున్నావు. నీకోసం ఎందరెందరికో ఉత్తరాలు రాశాను. చాలాకాలానికిగాను పూర్ణ దగ్గర్నుంచి నిన్ననే ఒకలేఖ వచ్చింది. దాంట్లో పూర్ణ, నువ్వు ఇటీవలే "మోరిస్ స్ట్రీట్"నుంచి మారి మహారాణీపేట 'భక్తిభవన్'లో వుంటున్నావని- తెలిపింది. ఆ వుత్తరంలో ఇంకా నిన్నుగురించిన విషయాలు చాలా రాసింది. అవి చదువుకొని అమితంగా విచారించాను.

చాలాసార్లు నువ్వు నాకు లేఖలు రాయనందుకు బాధపడ్డాను, గంటలకొలది ఏకాంతంలో కూచొని ఏడ్చాను. నాకు నేనే సాంత్వన వచనాల్ని చెప్పుకొని, నా అంతర్యాన్ని దిట్టపరుచుకునేదాన్ని! కాని ఏం చేసినా నీరూపు నా హృదయఫలకం మీద కన్పించి నాలో వేదనను రేపేది! దుఃఖాన్ని కల్పించేది! దీనికంతటికీ కారణం-నీవు నాపెళ్ళికి ముందు చెబుతూండే విషయాలవల్లనే నేమో? 'నేను పెళ్ళే మానుకుంటా' నంటే 'పిచ్చి హైమా! ఇలాంటి ఆలోచనలతో బుర్ర పాడు చేసుకోక, చదువుకో! పెళ్ళనేది ఋతుధర్మంలో పుష్పించే కుసుమం లాంటిది, దీన్నిగూర్చి ఆలోచించిన కొద్దీ మనిషి చెడిపోవటమేగాని ఒక సవ్యమైన మార్గం బోధపడనే పడదు—'అని నీవన్న కొద్దికాలానికే నా పెళ్ళి మధుతో కావటం ఒక చిత్రమైన సంఘటన! 'నేను పెళ్ళిచేసుకోను' అని అన్నప్పుడు నాలో ఎలాంటి భావాలున్నాయో తెలీదుగాని, ఈనాడు నా పెళ్ళయి వాస్తవిక జీవితంలోకి అడుగిడి నేచూచిన పరిస్థితుల్ని